సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 20 । జనవరి । 2023



ప్రకృతి ఒడిలో సింగరాయుడు

కోహెడ మండలం సింగరాయ లక్ష్మీనరసింహ స్వామి జాతర ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 8లో



తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భారీ మొత్తంలో నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. 8లో



విద్యాభివృద్ధికి కృషి

ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మన బడి కార్యక్రమం కింద పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. 9లో

న్యూస్‌రీల్

31 నుంచి క్రీడా పోటీలు

సంగారెడ్డి టౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2023 – 24 సంవత్సరానికి గాను క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రామచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 18 మధ్య వయస్సు గల సమర్థవంతులైన క్రీడాకారులకు సాయి ట్రైనింగ్ సెంటర్ జీఎంసీ బాలయోగి స్టేడియం సరూర్‌నగర్, ఇండోర్ స్టేడియం ఎల్‌బీ నగర్‌లో జనవరి 31, ఫిబ్రవరి 1న సెలెక్షన్స్ ఉంటాయని తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, హాకీ, కబడ్డీ, జిమ్నాస్టిక్స్ క్రీడలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు గల బాలబాలికలు ఆయా తేదీల్లో నిర్వహించే ఎంపిక శిబిరాలకు హాజరు కావాలని కోరారు.

శని అమావాస్యకు ఆలయాలు ముస్తాబు



శనిఘాట్ విగ్రహం

ఝరాసంగం(జహీరాబాద్): శని అమావాస్యను పురస్కరించుకొని ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి. మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామ శివారులోని సప్తపురి శనిఘాట్ శనీశ్వరాలయంలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే గాక సరిహద్దు రాష్ట్రం కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. శని అమావాస్యను పురస్కరించుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి. పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ఆవరణలో నిత్య పూజలతో పాటు శని మహాయజ్ఞం , 1,108 కళశములతో తిల తైలాభిషేకము నిర్వహిస్తారు. అభిషేకం చేసే భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

సాగు నీటిపై సమీక్ష



నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: నీటి పారుదల శాఖలో జరుగుతున్న పనులపై ఎమ్మెల్యే మాణిక్‌రావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఈఈ విజయ్‌కుమార్‌తో పాటు ఏఈలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని చెరువుల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. సంగమేశ్వర సాగు నీటి పథకం పనుల పురోగతిపై చర్చించారు. చెరువులకు సంబంధించిన మరమ్మతు పనుల గురించి ఆరా తీశారు.

పత్తి క్వింటాల్‌కు రూ.12వేలు చెల్లించాలి



పత్తిని పరిశీలిస్తున్న జయరాజ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పత్తికి క్వింటాల్‌కు రూ.12వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎల్లారంలో పత్తి రైతులతో కలిసి పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. పత్తి రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర చెల్లించడం లేదన్నారు. తక్షణమే రైతుల వద్ద ఉన్న పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్, రైతులు బాలయ్య, రత్నయ్య ఆనందం తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట కోర్టు ఏజీపీగా హరినారాయణ వర్మ



జోగిపేట(అందోల్): జోగిపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా సీనియర్ న్యాయవాది ఎస్.హరినారాయణ వర్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా గురువారం అందోలు ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌హెచ్ ఎస్ వర్మ నియమితులైనందుకుగాను బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్ న్యాయవాదులు ఎస్.నారాయణరెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, విఠల్‌రెడ్డి, న్యాయవాదులు అల్లె శ్రీకాంత్, లింగం యాదవ్, వెంకట్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు.

తొలిరోజు సజావుగా..

సందడిగా కంటి వెలుగు ప్రారంభం

- మూడింట రెండో వంతు మందికి చూపు సమస్యలు
- 25 శాతం మందికి ఆపరేషన్లు తప్పనిసరి
- ఒకేరోజు 11 వేల మందికి పరీక్షలు
- కంటి పరీక్ష చేయించుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



కొత్లాపూర్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, (ఇన్‌సెట్‌లో) కళ్లద్దాలతో మురిసిపోతున్న మహిళ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో 18 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిలో రెండో వంతు మంది కంటి చూపు సమస్యలతో బాధ పడుతున్నట్లు తేలింది. అలాగే సుమారు 25 శాతం మంది అద్దాలతో కాకుండా ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కంటి వెలుగు కార్యక్రమం గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. కంటి వెలుగు కార్యక్రమం తొలిరోజు మొత్తం 11,102 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ఇందులో 2,628 మంది తీవ్ర స్థాయిలో కంటి వ్యాధులతో బాధపడుతున్నట్లు తేలింది. తొలిరోజు 2,628 మందికి జిల్లా కేంద్ర ఆస్పత్రికి గానీ, సరోజినిదేవీ కంటి ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని అధికారులు సూచించారు. వీరికి క్యాటరాక్ట్, గ్లాకోమా, రేడియోపతి వంటి చికిత్సలు అవసరం అని గుర్తించారు.

- తొలిరోజు కంటి వెలుగు కార్యక్రమం సజావుగా సాగింది. జిల్లా వ్యాప్తంగా 69 గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో కంటి వెలుగు క్యాంపులు నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం నియమించిన వైద్యాధికారులతో పాటు, ఆయా గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఈ క్యాంపులను నిర్వహించారు.
- కంటి పరీక్ష చేయించుకునేందుకు వచ్చిన వారి పేరు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వంటి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకున్నారు. అక్కడి నుంచి కంటి వెలుగు యాప్‌లో వివరాలను నమోదు చేశాక కంటి పరీక్షల ప్రక్రియను ప్రారంభించారు. కేవలం రీడింగ్ గ్లాసులు అవసర పడిన పేషెంట్లకు వెంటనే ఆ గ్లాసులు అందజేశారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అవసరం ఉన్నవారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఒక్కో వ్యక్తికి కంటి పరీక్ష నిర్వహించడానికి కనీసం ఐదు నిమిషాలు పడుతోందని నిర్వాహకులు తెలిపారు.

1,770 మందికి అద్దాలు

తొలి రోజు పరీక్షలు నిర్వహించిన 11,102 మందిలో 1,770 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు అవసరమని తేలింది. ఈ మేరకు వారి కంటి సామర్థ్యాలకు సంబంధించిన డాటాను ఆధారంగా కంటి అద్దాలను తయారు చేసి పంపాలని అధికారులు ఇండెంట్ పెట్టారు. అలాగే రీడింగ్ గ్లాసులు అవసరం ఉన్న 2,919 మంది రీడింగ్ గ్లాసులను పంపిణీ చేశారు. ప్రిస్కిప్షన్ గ్లాసులను వారం రోజుల్లో సంబంధిత పేషెంట్లకు అందజేస్తామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 69 గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో కంటి వెలుగు క్యాంపులు నిర్వహించారు.

పరీక్షలు చేయించుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కంటి వెలుగులో భాగంగా జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలు నిజాంపేట్‌లో నిర్వహించిన కంటి వెలుగు క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇద్దరికి దగ్గర చూపు లోపం ఉందని తేలడంతో వారికి కంటివెలుగు అధికారులు రీడింగ్ గ్లాసులను అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి సహకరిస్తానని మెదక్ ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శంకరంపేట, గవ్వలపల్లి, గవ్వలపల్లి తండా, చందాపూర్, మల్లుపల్లి, భాగిరథపల్లి తదితర గ్రామాలకు సీడీపీ నిధులు రూ. 60 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. పలు గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా నిర్వహించిన పనుల బిల్లుల జారీ పెండింగ్‌లో ఉండడంతో నూతన పనులు చేయలేకపోతున్నామని సర్పంచ్‌లు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. అధికారుల నిర్లక్ష్యంతో తాము గ్రామాల్లో పనులు చేయలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. దీంతో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి పీఆర్‌డీఈ పాండురంగారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ శ్రీనివాస్‌తో పాటు జీఈఎస్ అధికారులతో సైతం మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజిరెడ్డి, పోచయ్య, నాయకులు గంగా నరేందర్, రాంగారవు, శ్రీనివాస్, శంకరయ్య, రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు సుధాకర్, సాన సత్యనారాయణ, శ్రీమన్‌రెడ్డి తదితరులున్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ



కంటి పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన మహిళతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ శరత్, చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్/సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అంధత్వ నివారణే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం సదాశివపేట మండలం ఆత్మకూర్ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ డాక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ కంటి వెలుగు విజయవంతానికి అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. కంటి సమస్య ఎక్కువగా ఉన్నవారికి కళ్లద్దాలను శిబిరం నుంచే ఆర్డర్ చేసి ఇంటికే పంపిస్తామన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్నవారికి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు పంపిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 69 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 64 వేలకు పైగా కళ్లద్దాలను తెప్పించామన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న చాకలి రాములు, చంద్రకళకు రీడింగ్ గ్లాసెస్‌ను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజర్షిషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి పాల్గొన్నారు.

కంటివెలుగుతో పేదల కళ్లల్లో ఆనందం: చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): కంటి వెలుగు కార్యక్రమంతో పేదల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందజేస్తారన్నారు. గురువారం పట్టణంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రిలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ రాజర్షితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంధత్వ నిర్మూలనకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమంలో చాలా మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, రెండో విడతలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులతో పాటు కళ్లద్దాలు పంపిణీ చేస్తారన్నారు. పట్టణంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రిలో 150 మంది, మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా హాలులో నిర్వహించిన కంటివెలుగులో 120 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి, టీపీఓ భాస్కర్‌గౌడ్, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఆర్ఐ గణేశ్, కౌన్సిలర్ చౌదరి ప్రకాష్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల విరేశం, తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి

ఇన్‌పేషెంట్ల విషయంలో నిర్లక్ష్యం వద్దు

డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి

జోగిపేట(అందోల్): ఆస్పత్రిలో చేరిన రోగులు డిశ్చార్జి అయ్యేంతవరకు ఆస్పత్రిలో ఉండేలా చూసే బాధ్యత డాక్టర్లు, సిబ్బందిదేనని, రోగులు ఇష్టారీతిన వ్యవరించకుండా చూడాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి అన్నారు. గురువారం జోగిపేట ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్లుగా ఉన్న రోగులు తమకు ఇష్టం వచ్చినప్పుడు ఆస్పత్రిలో ఉంటూ, గ్లూకోజ్, ఇంజక్షన్లు ఇవ్వగానే ఇంటికి వెళ్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆస్పత్రిలో ప్రతి నెలా వంద వరకు డెలివరీలు జరగాలని, ప్రస్తుతం 70 జరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. ఎక్కువగా నార్మల్ డెలివరీలే జరుగుతున్నాయన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్లు ఉన్నందున డెలివరీల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరుపుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అస్పత్రిలో అన్ని సౌకర్యాలున్నాయన్నారు. త్వరలో నర్సుల కొరత కూడా తీరుతుందని తెలిపారు. జోగిపేట ఆస్పత్రికి మంజూరైన డయాలసిస్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, జనరేటర్ రావాల్సి ఉందని, అది కూడా వారం రోజుల్లో బిగిస్తారన్నారు. డయాలసిస్ సెంటర్‌ను మంత్రి చేత ప్రారంభించేలా ఎమ్మెల్యేతో చర్చిస్తామన్నారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, శంకర్‌బాబు, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి భానుప్రకాష్, తదితరులు ఉన్నారు.

జిల్లాకు 5,100 కొత్త ఈవీఎంలు

- ఎన్నికలకు ఈసీ ముందస్తు ఏర్పాట్లు
- కాలం చెల్లిన ఈవీఎంల తరలింపు..
- ఇప్పటికే తుది ఓటరు జాబితా ప్రకటన



బాక్స్‌లో భద్రపరిచిన ఈవీఎంలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: శాసనసభ ఎన్నికలకు ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన అధికారులు తాజాగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను కూడా సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా 5,100 ఈవీఎంలను జిల్లాకు పంపింది. వీటిని ఈవీఎం గోదాముల్లో భద్ర పరిచారు.

- శాసనసభకు ఈ ఏడాది డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మరోవైపు రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తాయనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈవీఎంలను జిల్లాలకు పంపడం ప్రాధాన్యం సంతరించుకుంది.
- ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం తుది ఓటరు జాబితాను ఇటీవల ప్రకటించింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ జాబితాలను సిద్ధం చేసింది. ఓటరు జాబితా సవరణ నిరంతర ప్రక్రియ అయినప్పటికీ.. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కొత్త ఈవీఎంలను జిల్లాలకు పంపింది.

కాలం చెల్లిన ఈవీఎంల తరలింపు

- జిల్లాలో ఆయా ఈవీఎం గోదాముల్లో ఉన్న కాలం చెల్లిన ఈవీఎంలను ఇక్కడి నుంచి తరలించారు. సుమారు 15 సంవత్సరాల క్రితం తయారు చేసిన ఈవీఎంలను ఎన్నికల్లో వినియోగించకూడదని నిర్ణయించిన ఎన్నికల సంఘం పాత ఈవీఎంలన్నింటిని జిల్లాల నుంచి తెప్పించుకుంది.
- సంగారెడ్డి జిల్లా నుంచి కాలం చెల్లిన ఈవీఎంలు 15 తిరుపతిలో ఉన్న ఈసీఐఎల్ కార్యాలయానికి పంపారు. ఇందులో కొన్ని బ్యాలెట్ యూనిట్లు, కొన్ని కంట్రోల్ యూనిట్లు ఉన్నాయి. అలాగే సంగారెడ్డిలోని ఈవీఎంల గోదాములను సైతం అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సంగారెడ్డిలో ఉన్న ఈవీఎం గోదామును తెరిచిన అధికారులు ఇటీవల వాటికి మరమ్మతులు నిర్వహించారు. కాగా పటాన్‌చెరు ఎమ్మెల్యే స్థానం ఎన్నికల ఫలితాల విషయంలో కోర్టు విచారణలో ఉంది. దీంతో ఈ పటాన్‌చెరు ఈవీఎంల గోదాములను తెరవలేదు.

కొమురవెల్లి జాతర ఏర్పాట్ల పరిశీలన

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర(మొదటి వారం) ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ(అడ్మిన్) మహేందర్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్‌తో కలసి గురువారం పరిశీలించారు. ఆలయంలోని క్యూలైన్లు, పార్కింగ్, తోటబావి ప్రాంగణాన్ని పరిశీలించి స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. అలాగే అవసరం మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఇబ్బంది కలుగకుండ చూడాలని ఆదేశించారు. చేర్యాల, కిష్టంపేట, కొమురవెల్లి కమాన్ నుంచి వచ్చే వాహనదారులు బస్టాండ్ పక్కన ఉన్న గాజుల కిష్టయ్య ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయించాలన్నారు. అదేవిధంగా హైదరాబాద్ ప్రజ్ఞాపూర్, కొడకండ్ల, చిన్నకిష్టాపూర్, కొండపోచమ్మ టెంపుల్ నుంచి వచ్చే వాహనాలను పద్మశాలీ నిత్యాన్నదాన సత్రం ఎడమవైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేయించాలన్నారు. ఆయన వెంట చేర్యాల సీఐ శ్రీనివాస్, సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తదితరులున్నారు.

క్రీడా సమరానికి సన్నద్ధం

- మూడేళ్ల తర్వాత ఎస్‌జీఎఫ్ పోటీలు
- తొలిసారిగా నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- పీఈటీలు లేక విద్యార్థుల్లో నిరాశ



కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పాఠశాలల క్రీడలు రానే వస్తున్నాయి. క్రీడా సమరం సన్నద్ధానికి తొలిసారిగా విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం ఇటీవలే క్రీడల నిర్వాహక కార్యదర్శులను నియమించిన విషయం తెలిసిందే. గతంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల నుంచి రూ.3 చొప్పున ఉమ్మడి పరీక్షల విభాగం అధికారులు వసూలు చేసేవారు. మిగతా డబ్బులను దాతల నుంచి సేకరించేవారు.

- జోనల్ స్థాయిలో రూ.4 లక్షలు, జిల్లా స్థాయిలో పోటీలకు రూ.4 లక్షలు ఖర్చు అవుతాయి. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నిధులను క్రీడా పరికరాల కొనుగోలుకు, డీఈఓ అనుమతితో పోటీల నిర్వహణకు ఖర్చు చేసే ఆస్కారముంది.
- విద్యాలయాల్లో బాలబాలికలు క్రమేణా ఆటలకు దూరమవుతున్నారు. వారిలో నైపుణ్యాలు వెలికితీయడానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రీడలు నిర్వహిస్తున్నా.. కరోనా నేపథ్యంలో మూడేళ్లుగా అంతరాయం ఏర్పడింది.
- ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం నిధులు ఇవ్వదు. పోటీలు జరిగే క్రమంలో విద్యార్థులకు భోజన సౌకర్యం, దుస్తులు, ఆట వస్తువులు ఇతర ఖర్చులన్నీ కలిపి రూ.లక్షల్లో ఖర్చు అవుతాయి. తద్వారా క్రీడల నిర్వహణ కష్టంగా మారేది. ఈ నేపథ్యంలో డీఈఓల విన్నపం మేరకు విద్యాశాఖ కమిషనర్ ప్రత్యేక చొరవతో తొలిసారిగా ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.


రూ.82.50 లక్షలు మంజూరు

- ప్రాథమిక స్థాయిలో రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలో రూ.10 వేలను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా 1019 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లకు సంబంధించి జిల్లాకు రూ.82 లక్షల 50 వేల నిధులను విడుదల చేసింది.
- ఈ నిధులతో ప్రాథమిక పాఠశాలలో ప్లాస్టిక్ చెక్క క్రికెట్ బ్యాట్‌లు, వికెట్లు, సాఫ్ట్ బాల్, టెన్నిస్ బాల్, ప్లాస్టిక్ బాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, రగ్బీ సాఫ్ట్, బీన్ బ్యాగ్స్, డిస్కస్ ఫోం, జావెలిన్ త్రో పరికరాలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో అదనంగా స్కిప్పింగ్ రోప్, వాలీబాల్, వాలీబాల్ నెట్, త్రోబాల్, ఫస్ట్ ఎయిడ్ కిట్‌ల కొనుగోలుకు సంబంధిత దుకాణాలకు చెక్కుల రూపంలో చెల్లించేలా మార్గదర్శకాలను విడుదల చేసింది. జనవరి నెల నాటికి మండల, జోనల్ స్థాయి పోటీలు పూర్తి చేసుకోవడానికి అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

పీఈటీలను భర్తీ చేస్తేనే ప్రయోజనం

జిల్లాలో పీఈటీల కొరత తీవ్రంగా ఉంది. చాలా వరకు ఉన్నత పాఠశాలల్లో పీఈటీలు లేకపోగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అసలు పీఈటీలే లేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం తొలిసారిగా ఆటలకు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో పీఈటీలను నియమిస్తేనే క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుంది. సరైన శిక్షణ ఉంటేనే, రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికల్లో సత్తా చాటి విద్య, ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉంటుంది.

క్రీడా స్ఫూర్తి నింపేందుకే..



పాఠశాల స్థాయిల్లో విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఎస్‌జీఎఫ్ నిర్వహణకు నిధులు మంజూరు చేసింది. గతంలో ఎస్‌జీఎఫ్‌కు అవసరమైన నిధుల సేకరణకు దాతల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేది. విడుదలైన నిధులతో పాఠశాలకు అవసరమైన క్రీడా సామగ్రిని కొనుగోలు చేస్తాం. – రాజేశ్, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

కొండపాక(గజ్వేల్): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాకతీయుల కాలం నాటి శైవక్షేత్రాల్లో ఒకటైన భవానీ సమేత శంభు దేవాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. మండలంలోని దుద్దెడలో స్వయంభూ శంభు దేవాలయంలో ఆలయ ట్రస్టు చైర్మన్ గొల్లపల్లి రాంచంద్రమూర్తి శర్మ, స్వయంభూ శంభు లింగేశ్వరసేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఆలయ పూజారి తమ్మలి శంకర్ దంపతులు స్వామి తరుపున, సికింద్రాబాద్‌కు చెందిన ఉప్పల రాధా శ్రీనివాస్ దంపతులు అమ్మవారి తరుపున కల్యాణ పెద్దలుగా వ్యవహరించారు. కల్యాణానికి ముందు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శివపార్వతులకు మహిళలు ఒడిబియ్యం, పసుపు, కుంకుమ సమర్పించారు. కల్యాణాన్ని తిలకించినవారిలో జెడ్పీచైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జెడ్పీటీసీ అశ్విని, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి మహదేవ్‌గౌడ్, ఎంపీటీసీలు బాలాజీ, శిరీష, లింగేశ్వర సేవా సమితి సభ్యులు, హైదరాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, గజ్వేల్ నుంచి వచ్చిన భక్తులు తదితరులు ఉన్నారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరుటౌన్: మానసిక స్థితి సరిగాలేని ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.



రాజయ్య

బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అలిగేడుకు చెందిన రాజయ్య(62) గత ఏడాది దసరా పండుగ రోజు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అదృశ్యమైనట్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం పటాన్‌చెరు బస్టాండ్ కుటుంబ సభ్యుల్లో ఒకరైన శ్రీనివాస్ కు కనిపించాడు. దీంతో రాజయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. శ్రీనివాస్ ఫోన్ మాట్లాడుతుండగా రాజయ్య అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు గురువారం పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు.

పటాన్‌చెరుటౌన్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన ఏసుబాబు(42) అమీన్‌పూర్ పట్టణానికి బతుకుదెరువు కోసం వచ్చాడు. ఇస్త్రీ పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అతడి మతిస్థిమితం బాగుండటం లేదు. ఈనెల 10వ తేదీ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మంది పట్టుబడ్డారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 22 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ఇద్దరికి రూ.3 వేలు, ఒకరికి రూ.4 వేలు, మరో వ్యక్తికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. గురువారం వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా జడ్జి రమేశ్‌బాబు రూ.18 వేల జరిమానా విధించారు.

ప్రకృతి ఒడిలో సింగరాయుడు

- రేపు సింగరాయ లక్ష్మీ నర్సింహ స్వామి జాతర
- రానున్న లక్ష మంది భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెల్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి గ్రామాల మధ్యలో ఎత్తయిన గుట్టలు. గుట్టల నడుమ ఇరుకైన దారి. ఆ దారి గుండా వెళ్తే పచ్చని తోరణంలా కనిపించే వృక్షాలు. వాటి మధ్యలో లోయ ఆ లోయలో గలగల పారే నది ఉంది. అటువంటి ప్రకృతి అందాల నడుమ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనరసింహ స్వామి కొలువుదీరాడు. ఈ నెల 21వ తేదీన జరిగే సింగరాయ జాతరకు సర్వం సద్ధం చేశారు. ఏటా మాఘశుద్ధ అమావాస్య రోజున సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు జాతర జరుగుతుంది. తమ ఇష్ట దైవం ప్రతాపరుద్రుడిని దర్శించుకునేందుకు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, ముంబై, షోలాపూర్, బీవండి, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.

చరిత్రకారుల కథలెన్నో..

ఈ ప్రాంతంలో కాకతీయుల కాలంలో ప్రాజెక్ట్ నిర్మించేందుకు ఇంజినీర్ సింగరాయను పంపారు. ఇక్కడకు వచ్చిన ఆయన ప్రకృతి అందాలను చూసి మైమరచిపోయాడు. సింగరాయుడు ఇక్కడ కొండ గుహలో కొలువుదీరిన లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నాడు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా ఉండిపోవడానికి నిర్ణయించుకున్నాడు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉండగానే మరణించాడు.

ఇక్కడ వంట ప్రత్యేకం

జాతర వంట ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడికి వచ్చే భక్తులు శాకాహార వంట మాత్రమే వండుతారు. వంకాయ, చారు మాత్రమే తయారు చేస్తారు. ఇక్కడ వండిన వంట రుచిగా ఉంటుందని భక్తులు చెబుతారు. ఆలయ ప్రాంతంలో మాంసం తినడం, మద్యం తాగడం పాపామని భావిస్తారు. సాయంత్రం తిరుగు ప్రయాణం అవుతారు.



గుహలో కొలువైన స్వామివారు



భక్తుల కోలాహలం (ఫైల్)

కాలక్రమంలో శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంగా ఏర్పడిందని చరిత్ర చేబుతోంది

పారేనదిలో ఎన్నో ఔషధ గుణాలు

పడమరగా ప్రవహించే నదిలో నీరు స్వచ్ఛంగా ఉంటాయి. కొండ చరియలు, చెట్ల వేళ్ల అంచులను తాకుతూ పారేనీరు ఈ నది ప్రసిద్ధి. సింగరాయ గుండంలో స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని, చర్మవ్యాధులు నయమవుతాయని భక్తుల నమ్మకం. దీంతో ఈనదిలో స్నానం చేయడం స్థానిక ప్రజలు పుణ్యంగా భావిస్తారు. అనంతరం ఇరుకైన సొరికలో ఉన్నా లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటారు. కేవలం ఒక్కరోజు మాత్రమే ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతర జరుగుతుంది. పొద్దు పోయాక స్వామికి తలనొప్పి వస్తుందని భక్తులు దర్శనం చేసుకోరు. రాత్రి అయితే ఈ ప్రాంతం నుంచి అందరు వెళ్లిపోతారు.

ఏర్పాట్లు పూర్తి

సింగరాయ జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించారు. కూరెల్ల గ్రామ పంచాయ ఈఓ ఆధ్వర్యలో సర్పంచ్ గాజుల రమేశ్ ఏర్పాట్లు చేశారు. రహదారుల మరమతులు, వాహనల పార్కింగ్, నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

సరిహద్దు వివాదం

సింగరాయ జాతర ఈ సంవత్సరం వివాదాస్పదంగా మారింది. స్వామి వారి ఆలయం తమ ఊరి సరిహద్దులో ఉందని కూరెల్ల, తంగళ్లపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు గొడవపడుతున్నారు. ఇరు గ్రామాలకు చెందిన పంచాయతీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సబంధిత జిల్లా అధికారులతో మాట్లాడారు. గతంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పలుమార్లు సర్వేలు, డిజిటల్ సర్వే, పంచనామా నిర్వహించామని సింగరాయ ప్రాంతం పూర్తిగా కూరెల్ల గ్రామ పరిధిలో ఉందని, దీనిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఎమ్మెల్యే తెలిపినట్లు సర్పంచ్ గాజుల రమేశ్, మాజీ ఎంపీపీ శ్రీకాంత్ తెలిపారు.

జాతరకు ఇలా వెళ్లాలి

జాతరకు కరీంనగర్ నుంచి వచ్చే వారు బస్సులో కోహెడ వచ్చి, అక్కడి నుంచి ఆటోలో వెళ్లాలి. హైదరాబాద్, సిద్దిపేట జిల్లాల నుంచి వచ్చే వారు శనిగరం నుంచి గుండారెడ్డిపల్లి, బస్వాపూర్, తంగళ్ళపల్లి, కూరెల్ల నుంచి చేరుకోవచ్చు. అలాగే కూరెల్ల, తంగళ్లపల్లి, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల నుంచి వేర్వేరుగా దారులున్నాయి. ఎటునుంచి వచ్చిన రెండు కిలో మీటర్లు నడవాల్సి ఉంటుంది.

పోదాంపదా.. బండజాతర

- పుణ్యస్నానాలతో జాతర ప్రారంభం
- నేటి నుంచి 24 వరకు జరగనున్న ఉత్సవాలు
- ఊరి నుంచి బండపైకి స్వామివారి ఊరేగింపు

సిద్దిపేటరూరల్: లక్ష్మీనరసింహుడి బండ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. సిద్దిపేట జిల్లాలోని రూరల్ మండల పరిధిలోగల పుల్లూరు బండ జాతర మెదక్, సిద్దిపేట జిల్లాల్లో జరిగే జాతరలో ప్రధానమైంది. వెయ్యేళ్ల క్రితం కాకతీయులు పుల్లూరును కేంద్రంగా చేసుకుని సుమారు 70 గ్రామాలను పాలించేవారని శిలాశాసనాల ద్వారా తెలుస్తుంది. ఏటా మాఘ అమావాస్యను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు సర్పంచ్ నరేశ్ తెలిపారు.

బండపై పవిత్ర గుండాలు

లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు ప్రసిద్ధ గుండాలు ఉన్నాయి. వాటిలో ఒకటి చిన్నగుండం, రెండవది పాలగుండం, మూడోది నీళ్ల గుండం, నాలుగోది జీడి గుండం. పాలగుండంలో ఉండే నీళ్లు స్వచ్ఛంగా ఉంటాయని, దీనిలోతు ఇప్పటి వరకు ఎవరూ కనిపెట్టలేకపోయారు. సుమారు ఏడు తాటిచెట్ల లోతు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇందులోని నీరు ఇప్పటి వరకు ఎండిపోలేదు. ఇదంతా స్వామివారి మహత్యమేనని భక్తుల విశ్వాసం. ఈ గుండంలో స్నానం ఆచరిస్తే దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని భావిస్తారు.

బండపై ప్రసిద్ధ ఆలయాలు

బండపై పవిత్ర గుండాలతో పాటుగా ఆండాల్ ధ్వజస్తంభం, శ్రీరామపాదుకలు, నరసింహస్వామని సేవిస్తున్నట్లు కనిపించే ఆదిశేషుని విగ్రహాలు, త్రికుటేశ్వరాలయం, శిలాశాసనాలు, జైనమత ఆనవాళ్లు, శివాలయం, వేంకటేశ్వరస్వామి వంటి ఎన్నో పవిత్రస్థలాలు ఉన్నాయి.



ఆలయంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి

పోలీస్ వేషంలో యువకుడి మోసాలు

- అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రమేశ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): పోలీస్ వేషంలో ప్రజలను మోసం చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఏసీపీ రమేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం జగదేవ్‌పూర్ గ్రామ శివారు కెనాల్ వద్ద జగదేవ్‌పూర్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసిన జగదేవ్‌పూర్ మండలం మునిగడప గ్రామానికి చెందిన నరేశ్ బైక్‌పై పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంబడించి పట్టుకున్నారు. అతడి బ్యాగ్‌లో నరేశ్ పోలీస్ యూనిఫామ్ ధరించిన ఫొటోలు, బొమ్మ తుపాకీ, ఎయిర్ గన్, రెండు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్, హార్డ్‌డిస్క్ స్వాదీనం చేసుకున్నారు. నిందితుడిని ఎస్ఐ కృష్ణమూర్తి, గజ్వేల్‌రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి విచారించారు. పోలీస్ యూనిఫాంలో ఫొటో తీసుకుని స్నేహితులు, ఇతరులకు చూపుతూ ఇంటిలిజెన్స్ ఎస్ఐగా పనిచేస్తున్నానని అందరినీ బురిడీ కొట్టిస్తున్నాడు. ఆన్‌లైన్ యాప్ బెదిరింపులకు పాల్పడుతన్నాడు. పోలీస్ ఫొటోను డీపీగా పెట్టుకుని యువతులు, ఇతరులతో నగ్న ఫోన్‌కాల్స్ మాట్లాడి వాటిని రికార్డు చేసి వారిని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. పోలీస్ వేషంలో ఫొటోలు దిగి పోలీస్ ఇన్‌ఫార్మర్‌లమని చెప్పుకుంటూ ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు. నిందితుడు నరేశ్ బ్లాక్ మెయిల్ బాధితులు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌లో లేదా జిల్లా షీటీమ్ 7901640473, గజ్వేల్ ఏసీపీ 8333998684కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ.10 లక్షల నగదు, బ్రాస్‌లెట్, ఉంగరం ఎత్తుకెళ్లిన దుండగులు

పటాన్‌చెరుటౌన్: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. భారీ మొత్తంలో నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైం సీఐ బీసన్న కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ తేజకాలనీకి చెందిన నందూరి గోపీచంద్ రాజ్ ఈ నెల 14వ తేదీ సంక్రాంతి పండగకు సొంతూరు గుంటూరు వెళ్లాడు. తిరిగి 19వ తేదీన ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో దాచిన రూ.10 లక్షల నగదు, బ్రాస్‌లెట్, ఉంగరం ఎత్తుకెళ్లిన్నట్లు గ్రహించాడు.

చోరీ విషయంపై 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న సీఐ వేణు గోపాల్ రెడ్డి, క్రైం సీఐ బీసన్న, ఎస్ఐ రామానాయుడు, క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వేటకుక్కల దాడిలో లేగదూడ మృతి

నిజాంపేట(మెదక్): వేటకుక్కల దాడిలో లేగదూడ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారు శ్రీతిరుమల స్వామి ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. చల్మెడ గ్రామానికి చెందిన వెంకటరామ్ మోహన్ శర్మకు చెందిన లేగదూడ మృతి చెందిన విషయం రామాయంపేట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాము, గోపాలమిత్ర సంతోశ్ తెలుసుకున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి లేగదూడ కళేబరానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. లేగదూడపై వేట కుక్కలు దాడి చేసినట్లు వారు అధికారుల తెలిపారు.

సన్న బియ్యం స్వాహా దొడ్డుబియ్యంతో భోజనం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేస్తోంది. రెండు నెలలుగా పాఠశాలకు రావాల్సిన సన్న బియ్యం పక్కదారి పట్టింది. దొడ్డు బియ్యంతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. గురువారం మండలంలోని గాండ్లబాయ్ తండా పాఠశాలకు సాక్షి వెళ్లడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గాండ్లబాయ్ తండా పాఠశాల ఉపాధ్యాయురాలు రెండు నెలలుగా వివిధ కారణాలతో సెలవు తీసుకుంది. మరో పాఠశాల టీచర్‌తో తరగతులు నిర్వహిస్తున్నారు. అల్లాదుర్గం జెడ్పీ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్‌కు డిప్యూటేషన్ వేశారు. పాఠశాలలో బియ్యం అయిపోయాయి. పాఠశాల హెచ్ఎం సెలవు అయిపోగానే వస్తూ , మళ్లీ సెలవుపై వెళ్తోందని ఇన్‌చార్జి టీచర్ చెప్పారు. టీచర్ రాగానే బియ్యం అయిపోయాయని చెప్పాగానే టీచర్ భర్త రేషన్ బియ్యం బస్తాను పంపించాడు. కాగా పాఠశాలకు రావల్సిన సన్న బియ్యం ఎలా మాయమయ్యాయి? సరఫరా చేశారో లేదో తెలియని పరిస్థితి. అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంఈఓ బుచ్చానాయక్‌ను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళ ఆత్మహత్య



నవ్య మృతదేహం

పటాన్‌చెరు టౌన్: మానసిక స్థితి సరిగాలేని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మోతి మండలం హుసేనాబాద్ గ్రామానికి చెందిన పరశురామ్ బతుకుదెరువు కోసం వచ్చాడు. పటాన్‌చెరు మండలం ముత్తంగి కేవీఆర్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి రెండో కూతురు నవ్య(25)కు స్వగ్రామానికి చెందిన కిరణ్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. అల్లుడు కిరణ్‌ను కూడా పక్క అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా కొంతకాలంగా నవ్య అనారోగ్యంతో బాధపడుతోంది. మానసిక స్థితి సరిగా లేక రెండు సార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈక్రమంలో 19వ అపార్ట్‌మెంట్ 5 అంతస్తు పై నుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యతో తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తండ్రి పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.

కుటుంబ కలహాలతో..



రాథోడ్ బాలకృష్ణ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో జరిగింది. గురువారం భూంపల్లి ఏఎస్ఐ రవీందర్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం చాప్టా గ్రామానికి చెందిన అంజమ్మ, ప్రకాశ్ దంపతుల కుమారుడు రాథోడ్ బాలకృష్ణ (25)కు అక్బర్‌పేట గ్రామానికి చెందిన పవార్ లక్ష్మణ్ కూతురు సోనీతో నెలన్నర క్రితం వివాహం జరిగింది. బాలకృష్ణ ఇల్లరికం వెళ్లాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది అక్బర్‌పేట శివారు చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

మంజీరాలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని బోరంచ శివారు మంజీరా నదిలో గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు మనూరు ఎస్ఐ లక్ష్మణ్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోరంచ శివారులో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. వయస్సు 50 ఏళ్ల వరకు ఉంటుందని, సంబంధీకులు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

చెరువులోపడి వృద్ధుడి మృతి

మెదక్ రూరల్: స్నానానికి చెరువులోకి దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ ఫతేనగర్ వీధికి చెందిన ధర్మకర్త చత్వాజి(61) ఐదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. గురువారం శమ్నాపూర్ శివారులోని రాజేసుని చెరువులో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఎఫ్‌సీఐ ఉద్యోగి మృతి



ధరావత్ సంపత్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)ఉద్యోగి మృతి చెందాడు. అక్కన్నపేట మండలం రామవరం గ్రామపంచాయతీ పరిధి బంగారు లొద్ది తండాకు చెందిన ధరావత్ సంపత్(35) కరీంనగర్ జిల్లా ఎల్లపోతారం గోడౌన్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం తన కార్యాలయానికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గంలో వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో లారీ వెనుక చక్రాలకింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. సంపత్ మృతితో తండాలో విషాదఛాయలు అలముకున్నాయి.

రైలు కిందపడి విద్యార్థి మృతి



పట్టాలపై రాకేశ్ మృతదేహం

రామాయంపేట(మెదక్): రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన నర్సవ్వ, సంగమేశ్వర్ దంపతులకు కుమారుడు రాకేశ్, కూతురు ఉన్నారు. సంగమేశ్వర్ ఆర్టీసీ డ్రైవర్. కుమారుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అక్కన్నపేట వచ్చి తన ఇంటర్ సర్టిఫికెట్లు, దుస్తులు ఉన్న బ్యాక్ పట్టాలపక్కనే ఉంచి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి రైల్వేపోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈత వనాన్ని తగులబెట్టిన దుండగులు



కాలిపోయిన ఈత చెట్లు

దుబ్బాకరూరల్: భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామ శివారులోని ఈత వనాన్ని కొందరు దుండగులు తగులబెట్టినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు ఇర్కోడ్ సంతోష్‌కుమార్‌గౌడ్ గురువారం తెలిపారు. ఈదుల గడ్డలో దాదాపుగా వంద ఈత మొక్కలను నిప్పంటించారన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆరేళ్లుగా ఈత వనాలను పెంచుతున్నామన్నారు. గీత కార్మికులకు ఉపాధినిచ్చే ఈత వనాలను తగులబెట్టడంతో ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానితులపై భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

హత్య కేసులో లొంగిపోయిన నిందితులు

- వివరాలు వెల్లడించిన అల్లాదుర్గం సీఐ జార్జి
- చౌదరిపల్లిలో ఘటన



వివరాలు తెలుపుతున్న అల్లాదుర్గం సీఐ జార్జి

రేగోడ్(మెదక్): భార్య మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకోవడమేగాకుండా, తరచూ గ్రామానికి వస్తుండటంతో తన పరువు పోతోందని ఓ భర్త పక్కాప్లాన్‌తో భార్యను హత్య చేశాడు. ఈ కేసులో నిందితులు పోలీసులకు లొంగిపోయారు. గురువారం విలేకరుల సమావేశంలో అల్లాదుర్గం సీఐ జార్జి వివరాలు తెలిపారు. రేగోడ్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కేశయ్యతో పెద్దశంకరంపేట మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మికి 20 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.కొన్నేళ్లు కలిసి ఉన్నారు. ఈ క్రమంలో లక్ష్మి మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. భర్త పలుమార్లు చెప్పినా ఆమె వినలేదు. ఎనిమిదేళ్లుగా భర్తకు దూరమై కమలాపూర్‌లో ఉంటుంది. కేశయ్య రెండేళ్ల క్రితం మరో పెళ్లి చేసుకున్నాడు. రెండో భార్యకూ ఇద్దరు పిల్లలు ఉన్నారు. మొదటి భార్య లక్ష్మి భర్త కేశయ్యపై కేసు పెట్టింది. తనపై కేసు పెట్టడంతోపాటు చౌదర్‌పల్లికి తరచూ వచ్చి వెళ్తుండటంతో తన పరువు పోతోందని కేశయ్య భావించాడు. ఎలాగైనా మొదటి భార్య లక్ష్మిని వదిలించుకోవాలని పథకం వేశాడు.

కాపుకాచి.. హత్య చేసి

ఈనెల 16 తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మేనమామను చూసి వెళ్దామని లక్ష్మి, ఆమె అక్క పోచమ్మ, తల్లి కనకమ్మ ఆటోలో చౌదర్‌పల్లి వచ్చారు. అదేరోజు సాయంత్రం 4.30 సమయంలో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో చౌదర్‌పల్లి-రేగోడ్ మధ్య కల్వర్టు వద్ద భర్త కేశయ్య, తమ్ముడు ఎవాన్ ఆటోను అడ్డుకుని లక్ష్మిని ఆటో నుంచి బయటకు లాగారు. ఆటో డ్రైవర్‌ను వెళ్లిపోవాలని బెదిరించారు. లక్ష్మి, అక్క పోచమ్మను వాగులోకి తోసేశారు. కేశయ్య తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్య లక్ష్మి మెడ, ఎడమచేతిపై నరికాడు. కేశయ్య తమ్ముడు ఎవాన్ కూడా కత్తితో లక్ష్మిపై దాడి చేయడంతో ఆమె అక్కడికి అక్కడే మృతి చెందింది. ఇద్దరు నిందితులు కత్తిని వాగులో పడేసి పారిపోయారు.

మెదక్ కోర్టుకు తరలింపు

చౌదర్‌పల్లి మహిళ హత్య కేసులో భర్త కేశయ్య, సోదరుడు ఎవాన్ ఈనెల 19వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. వారిని మెదక్ కోర్టుకు తరలించారు.